క్లుప్తంగా

షాట్‌పుట్‌లో బంగారు పతకం


సాయికిరణ్

దుద్యాల్: జాతీయ స్థాయి షాట్‌పుట్ పోటీల్లో హస్నాబాద్‌కు చెందిన అల్వాల్ సాయి కిరణ్‌కు శుక్రవారం బంగారు పతకం సాధించారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో రెండు రోజులుగా కొనసాగుతున్న పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఆరు కిలోల షాట్‌పుట్ గుండును 17.91 మీటర్ల దూరం విసిరిన సాయికిరణ్ ప్రథమ స్థానంలో నిలిచాడు. ఏపీ ప్రభుత్వం ఆయనను బంగారు పతకంతో సత్కరించింది.

పంట నష్టాన్ని అధికారులకు నివేదిస్తా

నవాబుపేట: పంటల నష్టాన్ని అధికారులకు నివేదిస్తానని మండల వ్యవసాయాధికారి జ్యోతి పేర్కొన్నారు. మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి పంటలు నీట మునిగాయి. భారీ వర్షాలకు కేషవపల్లి, చిట్టిగిద్ద, చించల్‌పేట, పులుమామిడి, గొల్లగూడ, ముబారక్‌పూర్ తదితర గ్రామాల్లో మూసీ పొంగిప్రవహించడంతో దాదాపు 500 ఎకరాల్లో పంటలు నీట మునిగాయని జ్యోతి తెలిపారు. పలు గ్రామాల్లో నీట మునిగిన పంటలను ఆమె పరిశీలించారు.

చర్మవ్యాధి వైద్య శిబిరానికి విశేష స్పందన


పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

దుద్యాల్: హకీంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన చర్మవ్యాధి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని డాక్టర్ వందన పేర్కొన్నారు. శుక్రవారం స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ ఆధ్వర్యంలో చర్మవ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. 62 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ రాకేశ్, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ విద్య, సూపర్‌వైజర్ వజ్రమాళ, ఏఎస్‌ఎం విజయలక్ష్మి, ఆశ కార్యకర్తలు వసంత, రాములమ్మ పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు


నవాబుపేట: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవాబుపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. గైనకాలజిస్ట్, జనరల్ సర్జన్, పెడియాట్రిక్, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, సైకియాట్రిస్ట్, ఆర్థోపెడిక్, ఆప్తాల్మిక్ వైద్యులు 200 మందికి పరీక్షలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి రోహిత్, మౌనిక, ప్రసన్న, ఉష, యశస్వి, హిమబిందు, ప్రవీణ్, దివ్య, సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ అధికారులకు శిక్షణ

తాండూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తులో భాగంగా ప్రొసీడింగ్ అధికారుల శిక్షణకు పంచాయతీరాజ్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం శిక్షణ ప్రారంభించాల్సి ఉండగా భారీ వర్షం వల్ల శనివారానికి వాయిదా వేసినట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు. తాండూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10:30కు ప్రారంభమవుతుందని, జిల్లాలోని 17 మండలాల నుంచి ప్రొసీడింగ్ అధికారులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీపీ, జెడ్పీటీసీలను ఎస్టీకి రిజర్వు చేయాలి

తాండూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా పెద్దేముల్ ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు ఎస్టీకి రిజర్వేషన్ చేయాలని సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి సురేశ్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దేముల్ మండలంలో 15 తండాల్లో 12 వేలకు పైగా గిరిజనులు నివాసముంటున్నారని పేర్కొన్నారు. 25 ఏళ్ల క్రితం పెద్దేముల్ ఎంపీపీ ఎస్టీ రిజర్వుఅయ్యిందని, 15 ఏళ్ల క్రితం జెడ్పీటీసీ చేశారని గుర్తు చేశారు. తిరిగి ఆ స్థానాలను ఎస్టీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు.

స్వయం ఉపాధితో ఎదగాలి

కుల్కచర్ల: యువత స్వయం ఉపాధిని ఎంచుకొని భవిష్యత్‌లో ఎదగాలని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బొలుసాని శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ఓ చికెన్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా స్వయంశక్తిని నమ్ముకుని ఎదగాలన్నారు. గిరిజన సంఘం నాయకుడు బాలాజీ పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. భద్రం!

తాళాలేసిన ఇళ్లే టార్గెట్

- దొంగలు దోచేస్తున్నారు
- విలువైన వస్తువులు వెంట తీసుకెళ్లడం ఉత్తమం
- ముందస్తు జాగ్రత్తలతో దోపిడీ అరికట్టొచ్చు : పోలీసులు


హస్నాబాద్‌లో తాళం వేసిన ఇంట్లో దొంగలు ధ్వంసం చేసిన బీరువా

దుద్యాల్: బతుకు దెరువు కోసం వచ్చిన వారు, పట్టణాల్లో జీవనం సాగించేవారు పండుగలు (దసరా, బతుకమ్మ) జరుపుకోవడానికి తమతమ ఊళ్లకు చేరుకుంటున్నారు. అత్తారింటినుంచి పుట్టింటికి వెళ్లే భార్యభర్త కుటుంబంతో కలిసి వెళ్లడం సహజం. ఇటీవలే ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలలకు కూడా సెలవులు ప్రకటించింది. ఈ సందర్భంగా ఇంటిల్లిపాది పండుగలు జరుపుకోవడానికి సొంతూరికి వెళ్లక తప్పదు. కాబట్టి ఊర్లే వారు ఇళ్లకు తాళాలు వేసి చుట్టుప్రక్కల వారికి చెప్పి వెళ్లడం మంచిది. అవసరమైతే సమీప పోలీసులకు కూడా సమాచారం ఇచ్చి వెళ్తే ఉత్తమం. ప్రస్తుతం తాళం వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేసుకొని దోచేస్తున్నారు. కాబట్టి తమ విలువైన వస్తువులను, డబ్బులను ఇంట్లో దాచి పెట్టి వెళ్లొద్దు. లాకర్లలో పెట్టి వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. అంతే కాక తమతమ ఊళ్లకు వెళ్లే వారు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే దొంగతనాలను నివారించొచ్చని పోలీసులు సూచిస్తున్నారు.

ఇవీ గతంలో జరిగిన సంఘటనలు

కొడంగల్ నియోజకవర్గంలో కొన్ని సంఘటనలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. సాధారణ రోజుల్లోనే తాళాలేసిన ఇళ్లను గుల్ల చేసేస్తున్నారు. ఇక ఊళ్లకెళితే ఊరుకుంటారా? టార్గెట్ చేసి మరీ దోచేస్తారు. ఇక పండుగలు, వేడుకల సమయంలో సర్దుకోవడానికి వారికి అవకాశమెక్కువ. గతంలో దుద్యాల్ మండలం హస్నాబాద్ గ్రామంలో ఓ రైతు ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లాడు. సాయంత్రం వచ్చి చూసే వరకు రూ.2లక్షలు, వెండి ఆభరణాలు దోచేశారు. మరో సంఘటనలో.. బొంరాస్‌పేట మండలం ఏర్పుమల్లలో ఒకే రోజు మూడు ఇళ్లల్లో టార్గెట్ చేసేశారు. కావున తమ విలువైన వస్తువులను ఇళ్లలో ఉంచుకోకుండా లాకర్లలోగానీ, తమ వెంటగానీ తీసుకెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు.

అప్రమత్తతే రక్ష



ప్రజలు దసరాకు ఊళ్లకు వెళ్లడం సహజం. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లడం కంటే ఇంటి దగ్గర ఎవరినైనా ఒకరిని ఉంచి వెళ్తే ఉత్తమం. తప్పనిసరిగా విలువైన వస్తువులను తమ వెంట తీసుకెళ్లాలి. కుదరకపోతే లాకర్లలో జమ చేయాలి. పైన సూచించిన నియమాలు, జాగ్రత్త చర్యలు పాటిస్తే దొంగతనాలను పూర్తిగా అరికట్టవచ్చు.

– యాదగిరి, ఎస్‌ఐ, దుద్యాల్

పాటించాల్సిన ముందస్తు చర్యలు

- ఇళ్లకు వేసే తాళం నాసిరకం వాడోద్దు. తాళం కనబడకుండా కర్టైన్ కప్పాలి.
- బీరువా తాళం, ఇంటికేసిన తాళాన్ని తమ వెంటే తీసుకెళ్లాలి. ఇరుగు, పొరుగు వారికి ఇవ్వొద్దు.
- తలుపులు సెంటర్ లాక్ వేసిన తర్వాత గొళ్లెం పెట్టొద్దు.
- ఇంటి లోపల లైట్లు వేసి ఉంచాలి.
- గడప పక్కన రెండు, మూడు జతల చెప్పులు విడిచి వెళ్లాలి.
- పేపర్ బోయ్, పాలు, ఇతర వస్తువులు నిత్యం అందించే వారిని రావొద్దని సూచించాలి.
- ఊరుకు వెళ్లే ముందు చుట్టూపక్కల వారికి సమాచారం ఇచ్చి వెళ్లాలి. అనంతరం నిత్యం వారికి ఫోన్ చేసి క్షేమ సమాచార వివరాలు తెలుసుకోవాలి.
- అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్లో కూడా సమాచారం ఇచ్చి వెళ్లడం ఉత్తమం.

బ్రహ్మోత్సవాల్లో కళా ప్రదర్శనలు


శ్రీవారి ఉత్సవాల్లో గుస్సాడీ కళాకారుల బృందం

సీనియర్ జానపద కళాకారుడు అశోక్‌మాస్టర్ బృందం

బొంరాస్‌పేట: తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తెలంగాణ జానపద కళానృత్యాలను ప్రదర్శించి ఆకర్షిస్తున్నారు. జిల్లాకు చెందిన సీనియర్ జానపద కళాకారుడు అశోక్‌మాస్టర్ ఆధ్వర్యంలో 60మందితో కూడిన నాలుగు బృందాలకు ధింసా, గుస్సాడీ, లంబాడీ, కోయ నృత్యాలు ప్రదర్శించారు. ఈ నెల 27వరకు ఈ ప్రదర్శనలు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. స్వామివారి హంస వాహనం, సింహ వాహనం ఊరేగింపు, పల్లకీసేవా కార్యక్రమంలో మాడవీధులగుండా నిర్వహించిన ధింసా, గుస్సాడీ, లంబాడీ ప్రదర్శనలను వీక్షించిన పలువురు హర్షం వ్యక్తం చేశారని అశోక్‌మాస్టర్ వివరించారు. ఈ ప్రదర్శనలకు తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం గౌరవాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి అంజిలప్ప, కృష్ణయ్య, కళాకారులు అనంతయ్య, హన్మంతు, వెంకటేశం, శోభారాణి, అన్నపూర్ణ, కౌముధి, మాధవి, రేణుక, సంతోష సహకరించారన్నారు.

అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు

భారీ వర్షాల నేపథ్యంలో తహసీల్దార్ కిషన్ సూచన



దుద్యాల్: ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు, కాల్వలు పొంగిప్రవహిస్తున్నాయి. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని తహసీల్దార్ కిషన్ సూచించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరద నీరు భారీగా ప్రవహిస్తుంది. రహదారులు జలమయమయ్యాయి. రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రానున్న మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ స్తంభాల దగ్గరకు పిల్లలు, పెద్దలు వెళ్లొద్దు. మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి

మున్సిపల్ కమిషనర్‌కు వినతి


మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: దేవీ నవరాత్రి ఉత్సవాలు, దసరా సందర్భంగా పట్టణంలో అన్ని వార్డుల పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ యాదగిరికి బీజేపీ నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. వార్డుల పరిధిలో చెత్త సేకరణ, మురుగు కాల్వలను శుభ్రం చేయడం, విద్యుద్దీపాలు వెలిగేలా ఏర్పాటు చేయడం, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే పలు వార్డుల్లో కుక్కల బెడద తీవ్రంగా పెరిగిందని, వెంటనే వాటిని పట్టుకొని స్టెరిలైజేషన్ చేయించాలని వినతి పత్రంలో కోరారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగారం మల్లేశం, నాయకులు కృష్ణ, ప్రకాశ్, సంగమేశ్వర్, బిచ్చప్ప, చందు, బబ్లు తదితరులు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

చాకలి ఐలమ్మకు నివాళులు

తెలంగాణ వీర నారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు బీజేపీ పట్టణ కార్యదర్శి చాకలి బిచ్చప్ప ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, పట్టణాధ్యక్షుడు మల్లేశం, శివ, శరణప్ప, భీమేష్ పాల్గొన్నారు.


తాండూరు రూరల్: గాజీపూర్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు


తాండూరు టౌన్: చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ యాదగిరి, సిబ్బంది

గొప్ప పోరాట యోధురాలు ఐలమ్మ

వీరనారి చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఆమె జయంతి ఉత్సవాలను వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో నిర్వహించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ ఉద్యమంలో వీరనారి పాత్ర మరువేనిదన్నారు. గొప్ప పోరాట యోధురాలు ఐలమ్మ అని కీర్తించారు.


కుల్కచర్లలో నివాళులర్పిస్తున్న నేతలు


దౌల్తాబాద్‌లో..


కొడంగల్ రూరల్: కేక్ కట్ చేసి తినిపించుకుంటున్న సంఘం నాయకులు

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

బహుజన ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్


విరాళం అందజేస్తున్న గట్యానాయక్

దోమ: ప్రతిఒక్కరూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని బహుజన ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్ పేర్కొన్నారు. ఈ నెల 28న కొండాయపల్లి గ్రామంలో నిర్వహించనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం విగ్రహావిష్కరణ నిర్వాహకులకు రూ.50వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలో బడుగు, బలహీన వర్గాలకు సమాన హక్కులు కల్పించిన మహోన్నతమైన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, బీఎంపీ చేవెళ్ల పార్లమెంట్ కంటెస్టెడ్ అభ్యర్థి గోవింద్‌నాయక్, దోమ మండల అధ్యక్షుడు రవీందర్ నాయక్, అంబేడ్కర్ సంఘాల నేతలు, యువజన సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


దుద్యాల్: హస్నాబాద్‌లో దుర్గామాత పూజలో భక్తులు


కుల్కచర్ల: పాంబండపై ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు

వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో ఏర్పాటు చేసిన ఆయా మండపాల్లో, ఆలయాల్లో నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం శ్రీ లక్ష్మీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. నిత్యం అమ్మవారికి ప్రత్యేక నైవేద్యంతో పాటు అక్కడక్కడ నిర్వాహకులు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు అందుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు.


దౌల్తాబాద్: బాలంపేటలో కరెన్సీ నోట్లతో అలంకరించిన అమ్మవారి మండపం


ధారూరు: హరిదాస్‌పల్లిలో పూజలో చిన్నారులు


అనంతగిరి: వైభవలక్ష్మి ఆలయంలో కరెన్సీతో..


ధారూరు: మహాచండీదేవి అవతారంలో..

కళాశాలకు ప్రతీరోజు పంపించాలి


తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి

మోమిన్‌పేట: కళాశాలకు ప్రతీరోజు విద్యార్థులను పంపించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు తమ పిల్లలు వస్తున్నారా? లేదా? అనే విషయాన్ని తల్లిదండ్రులు తెలుసుకోవాలన్నారు. చదువుపై శ్రద్ధ చూపేందుకు ఉపన్యాసకులతో పాటు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. అదే విధంగా మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా ఎప్పుడు గమనిస్తూ ఉండాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులు కళాశాలలో బతుకమ్మ పేర్చి ఆడారు.

ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన: ప్రిన్సిపాల్


దోమ: విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రిన్సిపాల్ రూపలక్ష్మి

దోమ: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యా బోధన చేపడుతున్నారని ప్రిన్సిపాల్ రూపలక్ష్మి అన్నారు. శుక్రవారం దోమ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో విజ్ఞాన అభివృద్ధి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కళాశాలను అభివృద్ధి చేసే ప్రణాళిక, అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటు, చదువుపై చర్చ జరిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..పదేళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నిధులు రాక నిర్వహణ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కళాశాలలో సరైన వసతులు లేక అధ్యాపకులు, విద్యార్థులు నానా అవస్థలు పడ్డారన్నారు. కళాశాల నిర్వహణ కోసం ప్రభుత్వం కొంత మేర నిధులను మంజూరు చేసిందని గుర్తు చేశారు. త్వరలో కళాశాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. అధ్యాపకులు రాధ, శ్రీవిద్య, రాములు, లక్ష్మయ్య, సునీత, మధుసూదన్, శశిధర్, స్వప్న, సానియాసుల్తాన, శ్రీకాంత్, చంద్రశేఖర్‌రెడ్డి, బందెయ్య, తదితరులు పాల్గొన్నారు.